# పశ్చాత్తాపం

షాహీన్

మధ్యాహ్నం భోజనం చేసి అప్పుడే కునుకు పడుతున్న సమయంలో భార్య లలితాంబ తట్టి లేపడంతో మెలకువ వచ్చింది జనార్దన్‌కు.

ఎంతో అవసరమైతేతప్ప భార్య నిద్రలో వున్న తనను లేపదనుకుంటూ ''ఏమిటి విషయం?'' అంటూ కళ్ళు నులుముకుంటూ లేచాడు.

''పెళ్ళిళ్ల పేరయ్య వచ్చాడండీ. మన అమలకేదో మంచి సంబంధం తెచ్చారంట'' సంతోషంగా అంది లలితాంబ.

''అలాగా'' అంటూ ఎంతో ఆనందంగా వరండాలోకి వచ్చాడు జనార్దన్.

''ఆ...ఏమిటి నిద్రపోతున్నట్టున్నారు? నేను వచ్చి మీ నిద్ర పాడు చేసినట్టున్నాను?'' అన్నాడతను.

''అబ్బే అదేంలేదండీ.'' అన్నాడు జనార్దన్.

''మీవారు ఎక్కడ కన్పించినా, ఎప్పుడు కనిపించినా అమ్మాయి పెళ్లి గురించే చెబుతూ ఉన్నారమ్మా. పెళ్లికొడుకుల రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. మీరు ఇచ్చుకోలేరు. అందుకే నేను ఏ సంబంధం చూడాలన్నా భయపడ్డాను. కానీ మీ అమల అదృష్టమో ఏమోగానీ ఏ దేవుడో కరుణించినట్లు ఓ మంచి సంబంధం వచ్చిందమ్మా. వాళ్ళు కట్నం తీసుకోమని అన్నారు. పిల్ల చూడ్డానికి అందంగా ఉండి చదువుకుని, మంచి సాంప్రదాయంగల కుటుంబం నుండి వచ్చిన పిల్లయితే చాలునని అన్నారు. కట్టూబొట్టూ అన్నీ సనాతన సాంప్రదాయం ఉన్న తెలుగింటి ఆడపడుచు కావాలని వాళ్ళ కోరిక. అవన్నీ మీ అమ్మాయికున్నాయని తెలిసే ఈ సంబంధం మీకు తీసుకొచ్చాను. ఇదిగో అబ్బాయి ఫోటో చూడండి'' అంటూ ఫోటో ఇచ్చాడు లలితాంబకు.

''ఈ రోజుల్లో పైసా కట్నం తీసుకోకుండా పెళ్లి చేసుకోవాలని అనుకునేవాళ్ళున్నారా?'' విస్తుపోయాడు జనార్దన్. భార్య లలితాంబ ఆ ఫోటోని భర్తకిస్తే అతను కూడా చూసాడు.

''అబ్బాయి బాగున్నాడు. అమ్మాయికి ఈడూజోడూ బాగుంటుంది. కానీ కట్నం లేకుండా...'' అర్థోక్తిగా ఆగిపోయింది.

''చూడండమ్మా! మీరేవిధమైన ఆలోచనలు పెట్టుకోవద్దు. ఇలాంటి సంబంధం ఎంతో అరుదుగా వస్తుంది. పెళ్లిచూపులకి ఏర్పాటు చేస్తాను. సరేనా?'' అన్నాడు.

''మరి అబ్బాయి చదువు.. ఉద్యోగం..!''

''అయ్యో అలాగంటారేంటండీ! అవన్నీ లేకుండా నేను సంబంధం తెస్తానుటండీ? అబ్బాయికేమండీ ఎమ్‌బిఏ చదివాడు. ఎమ్ఎమ్‌టీసిలో ఉద్యోగం చేస్తున్నాడు. అంతకంటే కావాల్సిందేముంది?'' అన్నాడతను.

''అయితే తీసుకురండి'' అన్నారా దంపతులు.

''అలాగే. రేపు శుక్రవారం, పంచమి. బహు మంచి రోజు. నేను సాయంత్రం నాలుగు గంటలకు వారిని తీసుకొస్తాను.'' అని వెళ్లిపోయాడతను.

''ఇదేంటి లలితా! ఈ పేరయ్య చెప్పినవేవీ నమ్మబుద్ధి కావడంలేదు. అబ్బాయి చూస్తే అందంగా ఉన్నాడు. చదువు, మంచి ఉద్యోగం. అందునా గవర్నమెంటు ఉద్యోగం. హీనపక్షం మూడునాలుగు లక్షలన్నా కట్నం వస్తుంది. అలాంటిది ఏ కట్నం లేకుండా చేసుకోవడం.. నమ్మశక్యంగా లేదు'' అన్నాడు.

''అబ్బా మీకన్నీ అనుమానాలే. మనం పెళ్లి చేయడం లేదుకదా. పెళ్లిచూపులే కదా. వాళ్ళను రానీయండి. వాళ్ళ వివరాలవీ కనుక్కున్న తరువాతనే పెళ్లి చేద్దాం.''

''అవును లలితా! ఏం చేయను? ముగ్గురు మగపిల్లల తరువాత అమల పుట్టింది. వాళ్ళేదో మనల్ని ఉద్ధరిస్తారని వాళ్ళకి పెద్ద పెద్ద చదువులు చెప్పించాం. ఉన్న ఆస్తి అంతా వాళ్ళ చదువులకే హారతికర్పూరంలా అయిపోయింది. వాళ్ళకు ఉద్యోగాలు వచ్చి పెళ్ళిళ్ళు కావడంతో వాళ్ళు మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఎవరి దారి వారు చూసుకున్నారు. వాళ్ళకు మనం అవసరంలేదు. మన అవసరం తీరిపోయిందికదా. చెల్లెలు పెళ్లి రిటైరైపోయిన తన తండ్రి ఎలా చేయగలడో అన్న ఆలోచన వాళ్ళకు లేదు. అమల పెళ్లి చేయకుండా పోతానేమోనని బెంగ పట్టుకుంది. వచ్చిన సంబంధాలన్నీ కట్నాల దగ్గరో, కానుకల దగ్గరో బెడిసికొట్టడంతో దాని పెళ్లి ఈ జన్మలో చేయలేనేమోనని భయం వేయసాగింది. అందుకే నా బాధంతా పేరయ్యకు చెప్పుకున్నాను. అందుకే అతనీ సంబంధం తీసుకువచ్చాడు. ఈ సంబంధం కుదిరిపోతే ఇక నాకే దిగులూ ఉండదు. మనమ్మాయిని మించిన అదృష్టవంతురాలు ఎక్కడా ఉండదు'' అన్నాడు.

''అమల పెళ్లయిపోతే మనకింక ఏ దిగులూ ఉండదండీ. మనమెలాగో బ్రతికేయవచ్చు. అమల పెళ్లి గురించి దిగులే నన్ను పట్టి పీడిస్తోంది'' అంది లలితాంబ.

ఇద్దరూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగిపోయారు. పక్క గదిలో నుండి వింటున్న అమల ఈసారైనా పెళ్లి ఖాయం కావాలని మనసులోనే దేవుడ్ని ప్రార్థించింది.

• • •

ఆ రోజు ఉదయమే ఇంట్లో హడావుడి మొదలైంది. లలితాంబ లడ్డులు, మిక్చర్ తయారు చేసింది. మధ్యాహ్నం అయ్యేసరికి ఇల్లంతా అందంగా అమర్చడం పూర్తయింది. నాలుగయ్యేసరికి అమలకు ఉన్న దాంట్లోనే ఓ మంచి చీర కట్టించి ఒంటిపేట గొలుసు, జూకాలు వేసింది. అందంగా జడ అల్లి కనకాంబరాలు, మల్లెలు తురిమింది. అమలను చూస్తే బాపు బొమ్మలా వుంది. నాలుగు దాటినా వాళ్లింకా రాలేదు. దాంతో కంగారుపడిన జనార్దన్ ''నేనలా జంక్షన్ వరకూ వెళ్లొస్తాను'' అంటూ వెళ్లాడు. అతనటు వెళ్లగానే అయిదు నిముషాలకు పేరయ్య వాళ్ళను తీసుకువచ్చాడు. లలితాంబ వాళ్ళను సాదరంగా ఆహ్వానించింది.

పేరయ్య నవ్వుతూ ''ఇదిగోనమ్మా వీరే పెళ్లికొడుకు తండ్రి భాస్కరరావుగారు, ఆయన భార్య వసంతలక్ష్మి ఇక ఇతను పెళ్లికొడుకు వినయ్'' అని పరిచయం చేసాడు.

''ఈవిడ పెళ్లికూతురు తల్లి లలితాంబ. అన్నట్లు పెళ్లికూతురు తండ్రి ఎక్కడమ్మా?'' అని అడిగాడు.

''మీ కోసమే చూసి చూసి అలా జంక్షన్‌వరకు వెళ్లి వస్తానని ఇప్పుడే వెళ్లారు. ఆయనలా వెళ్లారు మీరిలా వచ్చారు. ఆయనొచ్చేస్తారు. మీరు కూర్చోండి'' అంది లలితాంబ.

వాళ్ళు కూర్చున్నాక పేరయ్య జనార్దన్ ఇంటి విషయాలన్నీ చెప్పాడు. వాళ్ళు అలా వింటూ ఉండగానే ఫలహారాలు తెచ్చింది లలితాంబ.

''కతికితే అతకదంటారు. ముందు అమ్మాయిని పిలిపించండి'' అంది వసంతలక్ష్మి.

అలాగేనంటూ అమలను తీసుకొచ్చింది లలితాంబ. కుందనపుబొమ్మలా వున్న అమల అందరికీ నచ్చింది. అమల, వినయ్ ఒకర్నొకరు చూసుకున్నారు.

''మాకందరికీ అమ్మాయి నచ్చింది'' అంటూ వసంతలక్ష్మి అంటుండగా జనార్దన్ వచ్చాడు.

వచ్చినవారెవరా అంటూ తలెత్తిన వసంతలక్ష్మి జనార్దన్ని చూస్తూనే ఆశ్చర్యంగా ఉండిపోయింది. జనార్దన్ కూడా ఆమెను చూస్తూనే ఉలిక్కిపడ్డాడు.

''వీరే పెళ్లికూతురు తండ్రి జనార్దన్‌గారు'' అంటూ పరిచయం చేసాడు పేరయ్య.

ఆ పేరు వింటూనే వసంతలక్ష్మి అతనేనని నిర్ధారణకొచ్చింది. ఆపైన ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయింది. మరో పావుగంట ఆ మాటా ఈ మాటా మాట్లాడుకున్నారు. కానీ వసంతలక్ష్మి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వెళ్లి కబురు చేస్తామన్నారు.

వాళ్ళు వెళ్లిపోయాక ''ఏవండీ అబ్బాయి బాగున్నాడు కదండీ. అమలక్కూడా బాగా నచ్చాడు. వాళ్ళు కూడా మనమ్మాయి నచ్చిందన్నారు. ఏ విఘ్నాలు

రాకుండా ఈ సంబంధం ఖాయమైపోతే బాగుండును'' అంది.

''అవును'' ముక్తసరిగా అని తన గదిలోకి వెళ్లిపోయాడు జనార్దన్.

అతనికి తెలుసు ఈ పెళ్లి జరగదని. వసంతలక్ష్మి తన కొడుక్కి అమలనిచ్చి పెళ్లి చేయదు. తనమీద కోపం తన కూతురి మీద చూపిస్తుంది. తను ఆ రోజుల్లో చేసిన పాపానికి ఫలితం ఈ రోజు వరకు అనుభవిస్తూనే ఉన్నాడు. అందుకే అమల పెళ్లికింతలా బాధపడ్తున్నాడు. వసంతలక్ష్మి ఈ పెళ్లి ఒప్పుకోవడమనేది కల్లో మాట. అయిపోయింది. ఈ సంబంధం కూడా తప్పిపోయింది. ఇక ఈ జన్మలో తను అమల పెళ్లి చేయలేడు. ఇప్పటికే ఎన్నో సంబంధాలు తప్పిపోయాయి. అవన్నీ కేవలం తను కట్నకానుకలు ఇవ్వలేకపోవడం వల్లే తప్పిపోయాయి. ఇప్పటికే బంధువులు, ఇరుగుపొరుగు వారి సూటిపోటి మాటలు వినలేక తనలో తనే కృంగిపోతోంది అమల. ఈ సంబంధం కూడా తప్పిపోతే అమల ఇక బ్రతకదు. పోనీ ఒకమారు వెళ్లి వసంతలక్ష్మని కలసి తను చేసిన తప్పుకు తన కూతుర్ని బలి చేయవద్దని బతిమాలితే... అవును అలాగే చేయాలి అనుకుంటూ మరునాడు ఆమె ఇంటికి వెళ్లడానికి నిశ్చయించుకున్నాడు.

• • •

పేరయ్య ఇచ్చిన అడ్రస్ కనుక్కుని వెళ్లాడు జనార్దన్. అదొక చిన్నసైజు బంగళాలా వుంది. బెల్ కొట్టాడు. పనిమనిషి వచ్చి తలుపు తీసింది.

''వసంతలక్ష్మిగారు...'' ఆపేసాడు.

''అమ్మగారు పైనున్నారండీ. కూచోండి బాబూ పిలుస్తాను'' అంది.

పైకెళ్లి వసంతలక్ష్మికి చెప్పింది. ఆమె గబగబా కిందకు దిగి వచ్చి అక్కడ జనార్దన్‌ని ఆశ్చర్యంగా చూసింది.

''ఓ మీరా! ఏంటి ఇలా వచ్చారు?''

'''మీతో మాట్లాడదామని...'' అన్నాడు.

''ఏంటో చెప్పండి'' ఠీవిగా కాలుమీద కాలు వేసుకుని కూర్చుంటూ అంది.

''అదీ...మా అమలకి మీ అబ్బాయికీ...'' ఆ తరువాత చెప్పలేకపోయాడు.

''ఊ...ఏమిటో చెప్పండి.''

''మీరు పెద్దమనసు చేసుకుని ఈ పెళ్లి జరిపిస్తే!''

''ఆహా అలాగా! ఇప్పుడు మీరడినట్లు ఒకానొక టైమ్‌లో మా నాన్నగారు మిమ్మల్ని అడిగినట్లు గుర్తు'' వ్యంగ్యంగా అంది.

''గతం అంటా గుర్తుంది కనుకనే నేను ఎంతో సిగ్గుపడుతున్నాను.''

''గతం గతః అంటూ మరచిపోక గుర్తుంచుకున్నందుకు థాంక్స్. అయినా ఇప్పుడు సిగ్గుపడి ప్రయోజనమేమిటి?'' అంది.

''నేను చేసిన పనికి క్షమించమని వేడుకుంటున్నాను'' దీనంగా ముఖం పెట్టి అన్నాడు.

''ఆ రోజుల్లో మీరు నన్ను చూసిన యాభయ్యో పెళ్లికొడుకు. ఆ సంబంధమన్నా కుదురుతుందని ఎంతో ఆశపడ్డాం. అలాగే కుదిరింది. ఇంట్లో అంతా సంతోషించారు. నా అదృష్టాన్ని పొగిడారు. నన్ను ఆకాశానికి ఎత్తేసారు. తాంబూలాలు పుచ్చుకున్నాక వాళ్ళ ఆనందం రెట్టింపయింది. నెలరోజుల్లో పెళ్లి ఉందనగా మీరు మా సంబంధం కాదన్నారు. కట్నం ఇంకా ఎక్కువ కావాలని అడిగారు. మా సంబంధం వదులుకోవాలనే ఉద్దేశ్యంతోనే మీరలా అన్నారు. మరోచోట మాకంటే ఎక్కువిచ్చే సంబంధం మీకు వచ్చిందని తరువాత తెలిసింది. ఏదైనా అమ్మి ఇవ్వడానికి కూడా మా నాన్న దగ్గర ఏ స్థిరాస్తిగానీ పొలాలుగానీ లేవు. నాకిక పెళ్లి కాదని మా అమ్మానాన్నా కృంగిపోయారు. సరిగ్గా అప్పుడే మా నాన్నగారి దగ్గర చదువుకుని పైకొచ్చిన భాస్కరరావు మా ఇంటికి వచ్చారు. మా పరిస్థితి చూసి నన్ను పైసా కట్నం లేకుండా వివాహం చేసుకున్నారు. మా అబ్బాయి పుట్టిన తరువాత కట్నం తీసుకోకుండా వాడికి పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నాం. వాడు కూడా మా ఆదర్శాలకు అనుగుణంగా చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. అందుకే మీ అమ్మాయిని చూడడానికి వచ్చాం.''

''నన్ను క్షమించండి. ఆ రోజు మీకలా చేయడంవల్లనే నేనీ రోజు అదే స్థితిలో ఉన్నాను. దయచేసి మా అమ్మాయికి అన్యాయం చేయవద్దు. మీరు కనుక చేసుకోకపోతే మేం ముగ్గురం ఏ విషమో తాగి చావాల్సిందే. ఇప్పటికే బంధువులు, ఇరుగుపొరుగు వాళ్ళు అనే మాటలు వినలేకపోతున్నాం'' అన్నాడు బాధగా జనార్దన్.

''పశ్చాత్తాపాన్ని మించిన ప్రాయశ్చితం మరొకటి లేదు. మీ అమ్మాయి నచ్చిందని ఆ రోజే చెప్పాను. ఇచ్చిన మాట వెనక్కు తీసుకోవడం మా ఇంటావంటా లేదు. మీతో సంబంధం కలుపుకుంటున్నామని తెలపడానికి పేరయ్యగారికి కబురుపెట్టాను.'' అంది.

''ఎంత మంచి శుభవార్త చెప్పారు. మీ రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేను'' అన్నాడు జనార్దన్ ఆనందంగా.

''అంతంత పెద్ద మాటలు ఎందుకులెండి. ఆడదాన్ని కాబట్టి సాటి ఆడదాని బాధను అర్థం చేసుకోగలిగాను.'' అంది వసంతలక్ష్మి.

★

